క్లుప్తంగా

కేవీకేలో కిసాన్ సమ్మేళన్

కలికిరి : కేవీకే కార్యాలయంలో గురువారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మేళన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి విడుదల చేసిన పీఎం కిసాన్ నిధులు, ప్రసంగాన్ని రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించారు. రైతులకు రూ.2వేలు వంతున ఖాతాలకు జమచేసినట్లు కేవీకే కో–ఆర్డినేటర్ పాండు రంగ తెలిపారు. పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మదనపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.శేషి కిరణ్, కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు, రైతులు పాల్గొన్నారు.

కలాం జీవితం ఆదర్శనీయం

మదనపల్లె సిటీ : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయమని ప్రముఖ వైద్యులు అజ్మతుల్లాఖాన్ అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అబ్దుల్‌కలాం వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ కలాం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశానికి అందించిన సేవలను కొనియాడారు. నేటి విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్, నాగరాజు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెల్‌విషర్స్ సంస్థ ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్.ఐ రమాదేవి, వెల్‌విషర్స్ నిర్వాహకులు గిరిష్, సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

రామసముద్రం : రైతుల సంక్షేమమే బీజేపీ ధ్యేయం అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పీఎం కిసాన్ 14వ విడత నగదును ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాజస్థాన్‌లో విడుదల చేసి, లక్ష కోట్లు వ్యవసాయ మౌలిక వసతులు నిధిని ఏర్పాటు చేసిన సందర్భంగా మోదీకి మండలంలోని బీజేపీ నాయకులు గురువారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశంలో 1.25 లక్షల కిసాన్ సమృద్ధి కేంద్రాలను, ఏపీలో 4500 కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రధాన మంత్రి ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, సుబ్రమణ్యం నాయుడు నాగభూషణం, చలపతి పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసర సరుకులు అందించాలి

పెద్దమండ్యం : చౌకదుకాణాల నుంచి నిత్యావసర సరుకులు కార్డు దారులకు సకాలంలో అందించాలని తహసీల్దార్ రాము అన్నారు. గురువారం ఎండీయూ ఆపరేటర్లు, చౌకదుకాణాల డీలర్లతో నిత్యావసరుకుల పంపిణీపై సమీక్షించారు. కార్డుదారులకు ఇంటివద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. సరుకుల పంపిణీ రిజిష్టర్‌లలో సక్రమంగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ గౌరీశంకర్, చౌక దుకాణాల డీలర్‌లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహించాలి

ములకలచెరువు : ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు బీఎల్‌ఓలకు ఆదేశించారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం వేపూరికోట, సోంపల్లె పంచాయతీల్లో తహసీల్దార్ పర్యటించి బీఎల్‌ఓల పనితీరును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్‌ఓలు పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లి పరిశీలించాలన్నారు.

సమష్టి కృషితో పంచాయతీని అభివృద్ధి చేద్దాం

పీలేరు రూరల్ : సమష్టి కృషితో పీలేరు గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 22.80 లక్షలు పంచాయతీకి వచ్చినట్లు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో తుప్పు పట్టిన వస్తువుల అమ్మకం ద్వారా పంచాయతీ కార్యాలయానికి రూ. 1,50,03,150 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి డంపింగ్ యార్డు స్థలానికి ముడుపుల వేముల పంచాయతీ పరిధిలో 10 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

కలికిరి కళాశాల ప్రిన్సిపాల్‌గా విశాలి

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎన్. విశాలి నియమితులయ్యారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి. శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పులివెందుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా అక్కడే మేథమేటిక్స్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఎం. సూర్యనారాయణ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. పులివెందుల ఈఈఈ విభాగాధిపతిగా డాక్టర్ షేక్ హుస్సేన్ వలి, పులివెందుల ఈసీఈ విభాగాధిపతిగా డాక్టర్ షేక్ తాజ్ మహబూబ్, కలికిరి మెకానికల్ విభాగాధిపతిగా డాక్టర్ డీ.ఆర్. శ్రీనివాసన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన



మణిపూర్ ఘటనపై ఐద్వా ఆధ్వర్యంలో మహిళా, ప్రజాసంఘాల నిరసన

మదనపల్లె : మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక సొసైటీకాలనీలో మణిపూర్ ఘటనను ఖండిస్తూ మహిళలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, ప్రధాని మోదీ మౌనం వీడి దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలో ఉంటే భవిష్యత్తులో మణిపూర్ లాంటి ఘటనలు ఇంకా ఎన్నో చూడాల్సి వస్తుందని తెలిపారు. సభ్యసమాజం తలదించుకునే రీతిలో అత్యంత క్రూరమైన ఘటనలు మణిపూర్‌లో జరిగాయని, బీజేపీ ప్రభుత్వం వాటిని నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. మణిపూర్‌లో తెగల మధ్య గొడవను, మతాల మధ్య గొడవగా చూపించడం అత్యంత నీచమని పేర్కొన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి యం.భాగ్యమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రాజేశ్వరి, అంగన్‌వాడీ యూనియన్, మదనపల్లె ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మధురవాణిలు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మూడునెలలుగా మారణకాండ జరుగుతున్నా శాంతి భద్రతలు కాపాడాల్సిన మోదీ ప్రభుత్వం మౌనం వహించడం దుర్మార్గమన్నారు. జాతుల మధ్య మత విద్వేషాలను రగిల్చి హింసను ప్రేరేపిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ప్రశాంత వాతావరణం కల్పించి, రాష్ట్ర ముఖ్యమంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేంద్ర, రిటైర్డ్ ఆర్‌జేడీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజనసేన ఆధ్వర్యంలో..

మణిపూర్ ఘటనకు కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని, ఘటనకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలని బహుజనసేన రాష్ట్రనాయకులు కొండపల్లి ఆనంద్, నాగార్జున తదితరులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థినులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, నజీర్‌ఖాన్, వినోద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో అనీమియా నివారణకు విఫ్స్



విద్యార్థులకు ఐరెన్ మాత్రలు ఇస్తున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

కలికిరి : పిల్లలలో రక్తహీనత (అనీమియా) నివారణకు విఫ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలలో రక్తహీనత నివారణకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మధ్యాహ్నం ఐరన్‌ఫోలిక్ ఆసిడ్ మాత్రలు మింగించడం జరుగుతోందని, దీంతో పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. కిశోర బాలికలకు హీమోగ్లోబిన్ బాగుండాలంటే ఐరెన్ ట్యాబ్లెట్లు ఉపయోగపడతాయన్నారు. వీటితో పాటు ఆకు కూరలు, పండ్లు, ఖర్జూరా, బెల్లంతో చేసిన వంటలు ఆహారంలో ఉండేటట్లు తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కరీముల్లా, హెచ్‌ఎం మురాషా, హెచ్‌ఈ మహమ్మద్ రఫీ, ఏఎన్‌ఎం మాధవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టి సారించండి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జెడ్పీటీసీ శివన్న

పెద్దతిప్పసముద్రం : రైతులందరూ సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు రామమోహన్ సూచించారు. మండలంలోని కాట్నగల్లు సచివాలయంలో గురువారం పట్టుగూళ్ళ పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. పట్టు సాగు చేసే రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించారు. సర్పంచ్‌లు మిట్టపల్లి అనసూయమ్మ, పూల గిరీష్, జెడ్పీటీసీ శివన్న, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకట్రమణమ్మ, ఉత్తన్న, పట్టు పరిశ్రమ సహాయకులు రమేష్, మురళీ, భాస్కర్, రామాంజనేయులు, బావాజాన్, షఫీ, అహమ్మద్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో మురళి

మదనపల్లె సిటీ : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఆర్డీవో మురళి తెలిపారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయలో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్–2023 పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ఆర్డీవో మురళి, ప్రిన్సిపాల్ గోవింద్‌రావులు జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. మొదట గ్రౌండ్‌లో క్రీడాకారుల నుంచి గౌరవ వందనం అందుకున్నారు. ఆర్డీవో మురళి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంతో నడుస్తున్న నవోదయ విద్యాలయాల్లో విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు బాగా రాణిస్తున్నారన్నారు. రీజనల్ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అథ్లెటిక్ మీట్ ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో జరుగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు,పీడీలు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవోను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రతిభ కనబరిచిన చిత్తూరు నవోదయ

క్లస్టర్ లెవల్ అథ్లెటిక్ మీట్‌లో జరిగిన పోటీల్లో చిత్తూరు నవోదయ విద్యాలయ 62 అంశాలలో జరిగిన పోటీల్లో అత్యధిక పాయింట్లు సాధించారు. వచ్చే నెల 3న రీజనల్ లెవల్ అథ్లెటిక్ మీట్ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో నవోదయ విద్యాలయ కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం–1,2,కరైకల్, పాండిచ్చేరి,చిత్తూరు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



బాహుదాకాలువ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : ప్రజారోగ్యం దృష్ట్యా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేస్తున్న ప్రత్యేక పారిశుధ్యపనులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి కోరారు. గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న బాహుదా కాలువ శుభ్రం పనులను క్షేత్రస్థాయిలో చైర్‌పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పట్టణం నడిబొడ్డున వెళుతున్న బాహుదా కాలువను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను, చెత్తను కాలువలోకి పడేయకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన చెత్త బుట్టల్లో వేయాలని కోరారు. స్వచ్ఛ మదనపల్లెగా పట్టణాన్ని తీర్చిదిద్దడంలో ప్రజలు తమకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలి



విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన

మదనపల్లె : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని సంస్థలో విలీనం చేసి వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం మధ్యాహ్నభోజన విరామ సమయంలో రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి, మదనపల్లె డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారం కోరుతూ శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జాఫర్‌వలీ, సెక్రటరీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కన్వీనర్ ఎస్.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ..కార్మికచట్టాల ప్రకారం శాశ్వత ఉద్యోగి చేస్తున్న విధులు, బాధ్యతలను కాంట్రాక్ట్ కార్మికులు చేసినట్లయితే శాశ్వత ఉద్యోగికి ఇచ్చే వేతనాలను కాంట్రాక్ట్ కార్మికులకు కనీసవేతనాలుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.1999 నుంచి 2004 మధ్య విద్యుత్ సంస్థల్లో నియమించిన ఉద్యోగులకు జీపీఎఫ్, పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలన్నారు. ఉద్యోగ విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించిన, శాశ్వత దుర్భలత్వం పొందిన జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2(ఎనర్జీ అసిస్టెంట్)లపై ఆధారపడిన కుటుంబసభ్యులకు కారుణ్య నియామకపథకంలో తక్షణమే ఉద్యోగాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. సంస్థ అంతర్గత సామర్థ్యం పెంచేందుకు తక్షణమే క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న అన్ని ప్రారంభస్థాయి ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాల్సిందిగా కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పీలేరు రూరల్ : విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని జేఏసీ అధ్యక్షుడు దేవరాజు, కన్వీనర్ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట భోజనం విరామం తరువాత రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర, ఏడీ సుధాకర్, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి

పీలేరు : అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని యువ పారిశ్రామికవేత్త జీ.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ నల్లగుట్టలో ఆత్మీయపలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన దివ్యాంగుడు మోహన్‌కు ట్రైసైకిల్ పంపిణీ చేశారు

జీఈఆర్ నమోదు పక్కాగా చేయాలి

నిమ్మనపల్లె : విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) వివరాలు పక్కాగా నమోదు చేయాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శేషగిరి రావుతో కలిసి సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ... సచివాలయ ఎడ్యుకేషనల్ వెల్‌ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించాలన్నారు. సర్వే వందశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం నిమ్మనపల్లె–1,2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు

ములకలచెరువు : ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అందజేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర సహకార సెల్ కన్వీనర్ బి.గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ నాయకులు సమృద్ధి కేంద్రం వద్ద మండల రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ధరలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలు నిల్వచేయడం కోసం కోల్ట్‌స్టోరేజ్‌లు సైతం నిర్మించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయరాంరెడ్డి, ఫరీద్‌బాబు, వెంకటరమణ, మోహన్‌కుమార్ నాగరాజు ఉన్నారు.

డంపింగ్ యార్డుల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు

కలకడ : చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీల అభివృద్ధి అధికారి, అంగన్‌వాడీ కేంద్రాల ఇన్‌చార్జ్ అధికారి మిద్దింటి ధనలక్ష్మి హెచ్చరించారు. గురువారం మండలంలోని దేవులపల్లె పంచాయతీలో నిర్మించిన చెత్తసేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డ్‌లో చెత్త సేకరణ, నిల్వ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. గ్రామంలో చెత్త సేకరణ ఎందుకు సక్రమంగా జరగలేదో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంఈఓ మునీంద్రనాయక్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మదనపల్లె : మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వద్దనున్న కోల్డ్ స్టోరేజీ సమీపంలో గురువారం రాత్రి జూదం ఆడుతున్న ఆరు గురిని అరెస్టు చేసినట్లు టు టౌన్ సిఐ మురళికృష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.46,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పట్టణంలోని నక్కలదిన్నెలో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్‌చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. గురువారం నక్కలదిన్నెకు చెందిన ఈశ్వర్‌నాయక్ భార్య మూడే అనసూయమ్మ(39) ఇంటివద్ద సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

పీలేరు : వేరుశనగ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. గురువారం మండలంలోని ముడుపులవేముల ఆర్‌బీకే పరిధిలో బోడినాయునిదొడ్డి గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగలో తెగుళ్ల నివారణకు సేంద్రియ ఎరువులు తయారీ, వాడకంపై అవగాహన కల్పించారు. వేరుశనగ పొలంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించే పంటలో దిగుబడి పెరుగుతుందన్నారు. జిల్లా వనరులకేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వి. శ్రీకాంత్, టి. సావిత్రి, వ్యవసాయాధికారి సుచిత్ర, షణ్ముగం, రమాదేవి, ఆర్‌బీకే చైర్మన్ మల్లికార్జున, ఏఈవోలు నజీర్, ఇంద్ర, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : రాష్ట్రంలో నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని కోసువారిపల్లె పంచాయతీలో పర్యటించారు. కొప్పలవారిపల్లె, గుమ్మిడికాయలపల్లె, ఆనిగానిపల్లె, ఎర్రివారిపల్లె, చిటికివారిపల్లె, వడ్డిపల్లె, నల్లతిమ్మిరెడ్డిగారిపల్లె, చిన్నరెడ్డివారిపల్లెల్లో గడప గడపకు వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రజా సమస్యలను ఆలకిస్తూ వాటిని పరిష్కరించే దిశగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా పేద వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రాధాన్యత క్రమంలో పాలన సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడైన ప్రజలు ఇలాంటి అభివృద్ధి చూసారా, సంక్షేమ పథకాలు మీ ఇంటి వద్దకే వచ్చేవ అంటూ ప్రజలను ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలన్నారు. చంద్రబాబు మోసపూరిత పాలన కంటే జగనన్న ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబం హాయిగా జీవనం సాగిస్తూ అభివృద్ధి బాటలో నడుస్తున్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, రఘునాథ్, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలకోటిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీయం గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, బాలాజీ, కిషోర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రామూర్తి,బొట్టు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బజారువీధి, ఎల్‌ఆర్‌వీధి, తిరుచుట్టి వీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు ఇప్పటికే గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చిందన్నారు. అన్ని వర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. మరోమారు వైఎస్ జగన్‌ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, మదనమోహన్ రెడ్డి, అబ్దుల్ కలీమ్, శ్రీధర్‌రాయల్, సాగుబడి ఆనంద రెడ్డి, షాహెద్, రవి తదితరులు పాల్గొన్నారు.

గడప గడప సమస్యలు పరిష్కరించండి

గుర్రంకొండ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, ఎంపీపీ సీతమ్మ అన్నారు. గురువారం మండలంలోని సరిమడుగు, నడిమికండ్రిగ గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, మండలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతనెలలో మండలంలోని నడిమికండ్రిగ, సరిమడుగు గ్రామాల్లో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఇందులో భాగంగా ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇప్పటికే సమస్యల పరిష్కారానికి తగిన నిధులు వారు మంజూరు చేశారన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు చొరవ తీసుకొని సదరు సమస్యలను త్వరగా పరిష్కరించేందకు చొరవ చూపాలన్నారు. హౌసింగ్‌బిల్లులు సకాలంలో పంపిణీ చేసి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని హౌసింగ్ ఏఈ ఈశ్వరయ్యను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్ స్వామిని ఆదేశించారు. రేషన్‌కార్డులు కోసం దరఖాస్తు చేసకొన్న వారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. త్వరలోనే మళ్లీ ఎంపీ పర్యటన మండలంలో ఉంటుందన్నారు. ఆలోగా సమస్యలన్ని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆర్బీకే చైర్మన్ సుధీర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, మాజీ ఎంపీపీలు నక్కాచంద్రశేఖర్, నక్కా వెంకటలక్ష్మమ్మ, మండల సచివాలయల కన్వీనర్ నాగేంద్ర, సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీటీసీలు బాబయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, నక్కానాగరాజ, రమణ పాల్గొన్నారు.

ఎంపీ తరపున ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీ పీఏలు, ప్రజాప్రతినిధులు

గుర్రంకొండ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి తరపున పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మండలంలోని సరిమడుగు, నడిమికండ్రిగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అప్పట్లోపలువురికి ఆర్థిక సాయం చేస్తానని ఎంపీ ప్రకటించారు. ఈనేపథ్యంలో ఎంపీ తరపున ఆయన పీఏలు రాజు, దస్తగిరి, తేజ ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా టి.రాచపల్లె పంచాయతీ గంగిరెడ్డిగారిపల్లెలో చర్చి అభివృద్ధి కోసం రూ. 50 వేలు, సరిమడగులో నాగమల్లన్నకు రూ.15వేలు, బాషాఖాన్‌కు రూ.15వేలు, అక్కులుకు రూ.15వేలు పంపిణీ చేశారు. నడిమికండ్రిగ పంచాయతీలో ప్యారంపల్లె దళితవాడలో మాతమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు, కొండమ్మకు రూ.15 వేలు, ఉమాదేవికి రూ.15వేలు, సుబ్బమ్మకు రూ. 15 వేలు, రమణమ్మ అనే మహిళకు వినికిడి యంత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్, ఎంపీపీ సీతమ్మ, మాజీ ఎంపీపీలు నక్కాచంద్రశేఖర్, వెంకటలక్షుమమ్మ, మండల సచివాలయల కన్వీనర్ నాగేంద్ర, మండల ఆర్బీకే చైర్మన్ సుధీర్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీటీసీలు బాబయ్య, నక్కానాగరాజ, రమణ, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

మాథ్స్ ఉపాధ్యాయురాలిని పాఠశాలకు రానివ్వం



మాట్లాడుతున్న పాఠశాల కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : మాథ్స్ ఉపాధ్యాయురాలు నుజమత్ నఫీసాను పాఠశాలకు రానివ్వమని పాఠశాల కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మదనపల్లె రూరల్ మండలం బాలాజీనగర్ ఉర్దూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పాఠశాల కమిటీ చైర్మన్ మున్వర్ మాట్లాడుతూ పాఠశాలలో పిల్లలు పాఠాలు బోధించకుండా విద్యార్థులను చెడుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికి నాలుగు సార్లు కమిటీ తీర్మానం చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పాఠశాలకు వస్తే పాఠశాల తరగతి గదులకు తాళాలు వేశామని గుర్తు చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. తమ బిడ్డలకు న్యాయం జరిగే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. విషయాన్ని హెచ్‌ఎం శ్రీదేవికి తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ అమ్మాజి, సభ్యులు రహిమా, షహీనా తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర



సీఆర్పీఎఫ్ కేంద్రంలో మొక్క నాటుతున్న కమాండెంట్ రాజేష్ కుమార్

కలికిరి : దేశ భద్రతలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని కమాండెంట్ రాజేష్ కుమార్ అన్నారు. సీఆర్‌పీఎఫ్ 85వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలికిరి సమీపం పాళ్యెం వద్దనున్న కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. సీఆర్‌పీఎఫ్ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 84 సంవత్సరాలుగా దేశ సేవలో సీఆర్‌పీఎఫ్ ప్రధాన పాత్ర పోషిస్తోందని, ప్రత్యేకించి ఎన్నికల నిర్వహణ, విద్రోహ నిరోధక బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందుటామని ఆయన అన్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో జవాన్‌లతో కలిసి మొక్కలు నాటారు. సీఆర్‌పీఎఫ్ ఆవిర్భాదినోత్సవం సందర్భంగా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెకండ్ ఇన్ కమాండ్ కేసీ నిర్మల్, డిప్యూటీ కమాండెంట్‌లు సి.నిషామోల్, శివ ప్రసాద్, ఎస్పీ నందన్వార్, సంజీవ్ వోహ్రా, అమర్ నాథ్ యాదవ్, ప్రసాద్, జవాన్‌లు, అధికారుల, జవాన్‌ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.